సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



ఉన్న ఊరిలోనే విద్యుత్ సేవలు

రాష్ట్రప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువ చేసింది. గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది - 8లో



నేటినుంచి మెగా కంప్లిషన్ డ్రైవ్

గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి డిసెంబర్ 1 నుంచి మెగా కంప్లిషన్ డ్రైవ్ నిర్వహించాలని హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్ తెలిపారు. - 8లో



మూగవేదనపై అప్రమత్తం

మన్యంలో చలికితోడు మంచు విపరీతంగా కురుస్తోంది. ఈ తరుణంలో మూగజీవాలకు వివిధ రకాల రోగాలు వచ్చే ఆస్కారముంది. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



డేటా సెంటర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను (రీసర్వే) కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. రూ.11 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో సర్వేకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని భద్రపరుస్తామని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. సర్వే వెరిఫికేషన్స్, విలేజ్ ఫైల్స్, భూ రక్షకు సంబంధించిన సమాచారం యూఎల్ పిన్ జనరేషన్, ఎల్‌పీఎం బల్క్ జనరేషన్, విలేజ్ మ్యాప్ తయారీ మొదలైన పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు, ఆర్డీఓ కె.హేమలత, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 5న ఉద్యోగ మేళా



గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా బ్రోచర్లను విడుదలచేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుమ్మలక్ష్మీపురం: చదువుకున్న ప్రతి విద్యార్థి ఉద్యోగం పొంది జీవితాన్ని సాఫీగా గడుపుకోవాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 5వ తేదీన నిర్వహించనున్న ఉద్యోగమేళాకు సంబంధించిన బ్రోచర్లను అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగమేళాలో 8 కంపెనీల ప్రతినిధులు హాజరై 400 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారెవరైనా ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ్ పాల్గొన్నారు.

2న దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

భామిని: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి దివ్యాంగ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 2న భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా దివ్యాంగ క్రీడాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఢిల్లీశ్వరరావు, కేవటి శ్రీను గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల దివ్యాంగ క్రీడాకారులు వివరాలకు ఫోన్: 99590 78682, 77022 57274 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శతశాతం 'ఉపాధి' కల్పన



అట్టలిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్

పాలకొండ రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు శతశాతం పనులు కల్పించాలని ఎన్ఆర్ఐఈజీఎస్ (ప్లానిటేషన్ విభాగం) జాయింట్ కమిషనర్ ఎ.అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. పాలకొండ మండలం అట్టలి గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాల కల్పనపై డ్వామా పీడీ కె.రామచంద్రరావును అడిగి తెలుసుకున్నారు. వలసల నియంత్రణలో భాగంగా శతశాతం పనులు అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన ప్రజా ప్రయోజన పనుల గుర్తింపు, ప్లానిటేషన్, పండ్ల తోటల అభివృద్ధిపై సూచనలు చేశారు. జిల్లా పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధిహామీ పనుల పురోగతిని ఏపీడీ శ్రీహరి కమిషనర్‌కు వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ డొంక త్రినాథ్, సర్పంచ్ కనుముల సంధ్యారాణి, కె.సూర్యనారాయణ, ఏపీఓ ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

ప్రతి గింజా కొనుగోలు

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళిక
- మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించే క్లస్టర్ వ్యవస్థ కొనసాగింపు
- అత్యంత పారదర్శకంగా కొనుగోలుకు ఏర్పాట్లు



యంత్రంతో పంట కోత



మెరకముడిదాం మండలం సోమలింగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జేసీ అశోక్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం/పార్వతీపురం: ఖరీఫ్ ధాన్యం సేకరణకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల యంత్రాంగం పక్కా ప్రణాళికను రూపొందించింది. ఈ ప్రక్రియలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలను అధికారులు తీసుకుంటున్నారు. కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, తూకం యంత్రాల సరఫరా, రవాణాకు వాహనాల ఏర్పాటు, మిల్లర్ల మ్యాపింగ్, బ్యాంక్ గ్యారెంటీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశారు. అత్యంత పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరగనుంది.

అమ్మకానికి వచ్చే ధాన్యమంతా కొనుగోలు...

రైతుల కుటుంబ అవసరాలకు పోగా అమ్మకానికి వచ్చే ధాన్యమంతా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. విజయనగరం జిల్లాలోని 27 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. ఎకరానికి కనీసం 25 నుంచి 35 బస్తాల చొప్పున దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన విజయనగరం జిల్లాలో 4,63,624 మెట్రిక్ టన్నులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అంచనా. రైతులు వారి కుటుంబ అవసరాలకు పోను విజయనగరం జిల్లాలో 3.41 లక్షల మెట్రిక్ టన్నులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తారు. విజయనగరం జిల్లాలో 510 ఆర్‌బీకేలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 185 ఆర్‌బీకేల ద్వారా ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

పెరిగిన మద్దతు ధర...

రైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర సైతం పెంచింది. గతేడాది సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2040 ఉండగా ఈసారి రూ.2183కు పెరిగింది. ఏ-గ్రేడ్ రకం మద్దతు ధర రూ.2060 నుంచి రూ.2203కి చేరింది.

అత్యంత పారదర్శకంగా కొనుగోలు

మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించేందుకు గత ఏడాది ప్రవేశ పెట్టిన క్లస్టర్ల వ్యవస్థను ఈసారి కూడా కొనసాగిస్తారు. క్లస్టర్లను మూడు కేటగిరీలుగా విభజించారు. ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు, పారదర్శకంగా నిర్వహించేందుకు ధాన్యం సహాయక ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. ఆర్‌బీకేలు, రైస్ మిల్లులపై నిరంతర పర్యవేక్షణ, తనిఖీల కోసం తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్లతో మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను నియమించారు.

ధాన్యం రవాణా సౌకర్యం ఉచితం

ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనెసంచులు, హమాలీలు, ధాన్యం రవాణా కోసం వాహనాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ఒకవేళ రైతులే వాటిని భరిస్తే గోనె సంచికి రూ.3.39 చొప్పున, రవాణాకు ప్రతి 8 కిలోమీటర్ల వరకూ టన్నుకు రూ.295 చొప్పున, హమాలీ చార్జీలు క్వింటాల్‌కు రూ.25 చొప్పున లెక్కకట్టి ఎంఎస్పీతోపాటు నేరుగా రైతుల ఖాతాలకే ప్రభుత్వం జమ చేయనుంది. ధాన్యం కొనుగోలు కోసం అవసరమయ్యే గోనెసంచులను రైతు భరోసా కేంద్రాలకు అందజేశారు.

ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశాం. ఆర్బీకే, మిల్లుల వద్ద తేమ శాతంలో తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం. రైతుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు.

– ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

రైతులకు అవగాహన కల్పించిన అంశాలు

- ఆర్‌బీకే క్లస్టర్ వద్ద ఉన్న టెక్నికల్ సిబ్బంది రైతు కల్లం వద్దకే వచ్చి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తారు. వారు ఏరోజు వస్తారో కూపన్ ద్వారా తెలియజేస్తారు. రైతులు ఆర్‌బీకే నుంచి కూపన్ కచ్చితంగా తీసుకోవాలి.
- రైతు విక్రయించిన ధాన్యం, వాటి విలువ తదితర వివరాలతో కూడిన రశీదు (ఎఫ్‌టీఓ) కొనుగోలు సమయంలో ఇస్తారు. రశీదు కచ్చితంగా తీసుకోవాలి.
- రైతుకు ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) కాపీను అందజేసిన తర్వాత రైతు పాత్ర ముగుస్తుంది. కనుక రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ రైస్ మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేదు.
- ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల్లోపే వారి ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ అవుతాయి.
- రైతు భరోసా కేంద్రం ద్వారా నిర్దేశించిన నాణ్యతా ఫలితాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీనిపై రైస్ మిల్లర్ల అభ్యంతరాలు పరిగణనలోకి రావు.
- ఆర్‌బీకే ద్వారా కాకుండా బహిరంగ మార్కెట్లో అమ్మదలచిన రైతుల వివరాలను ఆర్‌బీకేలో తప్పనిసరిగా నమోదుచేయాలి. మీ పేరుతో మరొకరు ధాన్యం విక్రయించి దుర్వినియోగపరచకుండా ఈ జాగ్రత్తలు తీసుకున్నారు

జగనన్నపాలనలో పేదలకు

స్వర్ణయుగం



పేదలకు పట్టాలు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు
- మన్యంలో పనుల జోరు
- పేదలందరికీ పట్టాలు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన పేదలకు స్వర్ణయుగమని, అర్హతే కొలమానంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల కింద ఆర్థిక ప్రయోజనం కల్పించారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సంపూర్ణ దళిత భూహక్కు పథకం కింద 73.33 ఎకరాల భూమిపై 83 మంది లబ్ధిదారులకు హక్కుపత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతులకు భూమిపై సర్వ హక్కులు కల్పిస్తూ సంఘంలో వారి గౌరవాన్ని పెంపొందించేలా జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. భూమిని సాగుచేస్తూ ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. 33 మందికి డీ పట్టాలు, సాలూరు మండలంలోని 21 పంచాయతీల్లో ఎస్సీలకు రుద్రభూమి కోసం 10 సెంట్లు చొప్పున స్థలం కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. సాలూరు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద సుమారు రూ.1300 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించినట్టు స్పష్టం చేశారు. అలాగే, మరో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ఎవరి పాలనలో నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తుందో ప్రజలు గమనించాలని కోరారు. ప్రతి పేదవానికి ఆర్థిక ప్రయోజనం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ నాయకులవలే మోసపూరిత హామీలు ఇవ్వడం మాకు చేతకాదన్నారు. చేసినదే చెబుతామని చెప్పారు. గత టీడీపీ హయాంలో కేంద్రీయగిరిజన యూనివర్సిటీ సాలూరు నుంచి ఎస్.కోటకు తరలించే ప్రయత్నం చేయగా, దానిని మళ్లీ సాలూరు నియోజకవర్గ పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. నియోకవర్గం ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ప్రజలందరికీ తెలుసని, టీడీపీ సాలూరు పట్టణ అధ్యక్షుడు చెప్పే మోసపూరిత మాటలు, విమర్శలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఊరకనే విమర్శలు చేసేవారిపైన, తప్పుడు వార్తలు ప్రచురించేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఏఎమ్‌సీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గొర్లె జగన్, దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, తహసీల్దార్ బాల మురళీకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహాకవి మనసాస్మరామి

- గురజాడ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహం నుంచి భారీ ర్యాలీ
- మహాకవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సాహితీవేత్తలు
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాహితీ సదస్సు



గురజాడ ఉపయోగించిన వస్తువులతో విజయనగరంలో ర్యాలీ

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు 108వ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. గురజాడ స్వగృహంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, పట్టణ ప్రముఖులు మహాకవి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మహాకవి వాడిన వస్తువులతో గురజాడ స్వగృహం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి గురజాడ కాంస్య విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. గురజాడ దేశభక్తి గీతాలాపనతో ఆ ప్రాంతమంతా దేశభక్తిని ప్రతిబింబించింది. కాంస్య విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించిన అనంతరం గురజాడ ఉత్తమ కవితా పురస్కార గ్రహీతలను సత్కరించారు. ఈ సందర్భంగా గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, సమాఖ్య అధ్యక్షుడు పి.వి.నరసింహరాజు (బుచ్చిబాబు), కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ గురజాడ సాహితీ చైతన్యోత్సవం పేరుతో గత 23 ఏళ్లుగా మహాకవికి నివాళులర్పిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో ఉత్తమ కవితా పురస్కారాలకు ఆంధ్రరాష్ట్రం నుంచి ఆరుగురు, తెలంగాణా నుంచి నలుగురు వ్యక్తులు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది గురజాడ విశిష్ట పురస్కారాన్ని సినీ గేయరచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు డిసెంబర్ 3న ఆనందగజపతి కళాక్షేత్రంలో ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు హాజరవుతారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొంటారన్నారు. ఆ రోజు నిర్వహించే సభకు ముందుగా మహిళలందరూ కలిసి గురజాడ కన్యాశుల్కం నాటకంలోని ఓ సన్నివేశాన్ని ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో గురజాడ కుటుంబీకులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, డాక్టర్ జక్కు రామకృష్ణ, సాలూరు సంతోషి, అల్లంశెట్టి శ్రీనివాసరావు, లోగిశ లక్ష్మునాయుడు, భోగరాజు సూర్యలక్ష్మి, ఈపు విజయకుమార్, మానాప్రగఢ సాహితి, స్వరూప, త్యాగరాజ సంగీత నృత్యకళానికేతన్, గురజాడ, సన్ స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గురజాడ సాహితీ సదస్సు

మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో గురజాడ సాహితీ సదస్సు నిర్వహించారు. సభలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ జర్రా అప్పారావు (విశాఖ), గురజాడ రచనలలో సామాజిక చైతన్యం అనే అంశంపై ప్రసంగించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు (పార్వతీపురం) గురజాడ బాల సాహిత్యంపైన, మదనాపురం ఆదర్శపాఠశాల పీఎస్‌వీ శేషాచార్యులు, ఎస్.ఆశాభవానీలు గురజాడ దేశభక్తిగీతం, విశ్వజనీనం అనే అంశాలపై ఉపన్యసించారు. అనంతరం గురజాడ ఉత్తమ కవితా పురస్కార గ్రహీతలలో కిలపర్తి దాలినాయుడు (సాలూరు), సాలూరు సంతోషి (విజయనగరం), అల్లంశెట్టి శ్రీనివాసరావు (విశాఖ), కుప్పిలి వెంకటరాజు (ఆమదాలవలస), రత్నాల బాలకృష్ణ (విజయనగరం), లోగిస లక్ష్మీనాయుడు (సింహాచలం)లు స్వీయకవితా పఠనం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, డాక్టర్ జక్కు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

వేగవంతంగా కేసుల దర్యాప్తు

- గంజాయి, సారా అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- సైబర్ నేరాలపై దృష్టి సారించాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్ఐ నీలకంఠరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

పార్వతీపురంటౌన్: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, గంజాయి, సారా అక్రమ రవాణాపై నిఘా వేయడంతోపాటు సైబర్ నేరాలపై డేగకన్ను వేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వారీగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, సారా రవాణా జరగకుండా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులతో కలిసి దాడులు నిర్వహించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వాహనచోదకులకు అప్రమత్తంచేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. సాక్షులు నిర్భయంగా జరిగిన వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట చెప్పేలా తర్ఫీదునివ్వాలని సూచించారు. నేరం చేసిన వారికి జైలు శిక్ష పడినప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. 174 సీఆర్‌పీసీ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేసి తప్పిపోయిన వారిని ట్రేస్ చేయాలన్నారు.

ప్రజలను చైతన్యవంతం చేయాలి

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా, ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకునేలా చైతన్యవంతం చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే సంక్షిప్త సమాచారాలు, మెయిల్స్‌లలోని లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. లింక్‌లను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మొత్తం మాయమయ్యే ప్రమాదం ఉందని, యాప్‌ల ద్వారా లోన్ ఇస్తామని ఫోన్ చేసిన వారి మాటలను నమ్మొద్దన్నారు. వాటి వెనక ప్రమాదం ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. సైబర్ హెల్ప్‌లైన్ 1930కు గాని, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ హెచ్‌టీటీపీ://సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్‌కు గాని వెంటనే తెలిపి సహాయం పొందాలని ప్రజలకు సూచించాలన్నారు. నేర సమీక్ష సమావేశంలో ఏఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ఎస్పీ, ఎస్‌బీ డీఎస్పీ జి.మురళీధర్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి.అజీజ్, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి.ప్రభాకరరావు, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సూపరింటెండెంట్‌లు కోటేశ్వరరావు, సూర్యకుమారి తదితరలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

ప్రాపర్టీ కేసుల్లో ముద్దాయిలను పట్టుకోవడం, చోరీ కాబడిన సొత్తును రికవరీ చేయడం, విధుల్లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నవారిలో నీలకంఠపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు, సీతంపేట పీసీలు పి.ఎస్.డి.మాణిక్యాలరావు, ఈవీజీ నాయుడు, సీహెచ్ మహేశ్వరరావు, పార్వతీపురం టౌన్ పీఎస్ హెచ్‌సీ ఎస్.రాజశేఖర్ కంప్యూటర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కానిస్టేబుల్ ఎస్.అప్పలకొండ, శేఖర్ ఉన్నారు.

ఓటే వజ్రాయుధం

- ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి



ఓటు హక్కు ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

పాలకొండ: ఓటు హక్కు వజ్రాయుదం వంటిదని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఓటు నమోదు, వినియోగం, ప్రాధాన్యత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ హక్కును స్వీకరించాలన్నారు. భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో యువత ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటు వినియోగం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని వక్తలు, ఉపన్యాసకులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 20 గొర్రెపిల్లల మృతి

వంగర: మండల పరిధి మద్దువలస గ్రామంలో కుక్కలు దాడిచేయడంతో 20 గొర్రెపిల్లలు మృతిచెందాయి. తాము నిద్రిస్తున్న సమయంలో బుధవారం అర్ధరాత్రి కుక్కలు గొర్రెల శాలలో చొరబడి దాడికిపాల్పడ్డాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు గ్రామానికి చెందిన గంటమాని సన్యాసి కోరుతున్నాడు.

తమ్ముడిపై అన్న దాడి


తలపై తగిలిన గాయంతో తమ్ముడు ప్రతాప్

వీరఘట్టం: అన్నదమ్ముల మధ్య వ్యాపార లావాదేవీలు చివరకు కొట్లాటకు దారితీశాయి. యాక్సా బ్లేడ్ కట్టర్‌తో తమ్ముడిపై అన్న దాడిచేయడంతో తలపై గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో క్షతగాత్రుడు పోలీసులను ఆశ్రయించగా పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించి ఎస్సై ఎం.వి.రమణ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన భోగి నాగేశ్వరరావు కుమారులైన శ్రీనివాసరావు, ప్రతాప్‌లకు కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలున్నాయి.ఒకే ఇంటిలో నివాసం ఉంటున్న వారి మధ్య తరచూ వాగ్వాదం జరుగుతూనే ఉంది. గతంలో వీరు పోలీసులను ఆశ్రయించగా సర్దిచెప్పడంతో పాటు బెండోవర్ కేసులు కూడా నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.గురువారం వీరి మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారి తీసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

9 పశువుల వాహనాలు సీజ్

బొబ్బిలి: ఒడిశా సరిహద్దుతో పాటు పార్వతీపురం,కురుపాం, కూనేరు ప్రాంతాల నుంచి పశువులను తరలిస్తున్న 9 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక అంతర్రాష్ట్ర రహదారిలో కాపు కాసిన పోలీసులు వాహనాల్లో పశువులు తరలిస్తున్నట్లు గుర్తించి నిలుపుదల చేశారు. అలా ఒక దాని వెంట ఒకటిగా మొత్తం 9వాహనాలను సీజ్ చేశారు. వాహనాల్లో మొత్తం 86 పశువులు ఉన్నాయని ఎస్సై చదలవాడ సత్యనారాయణ, ఏఎస్సై బీవీ రమణలు ఈ సందర్భంగా తెలిపారు. వాహనాల్లో కిక్కిరిసి ఉంచి వాటికి ఏ విధమైన నీరు, ఆహారం లేకుండా తరలిస్తున్నారన్నారు. ఈ వాహనాలన్నింటినీ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అబ్దుల్ హామీద్ తదితరులు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని ఆయనకు ముస్లిం సోదరుల తరపున అభినందనలు తెలియజేస్తున్నట్లు ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం గజపతినగరంలోని మసీద్‌లో ముస్లిం సోదరులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూసుకుపోతున్న అభివృద్ధిని ముస్లిం సోదరులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ముస్లిం సోదరులు, మైనారిటీలకు జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా తెలియజేసేందుకు ఆయన ఆవిష్కరించారు.

ప్రొఫెసర్ శాంతమ్మకు ఇస్పా అవార్డు బహూకరణ


ప్రొఫెసర్ శాంతమ్మకు ఇస్పా అవార్డు అందజేస్తున్న సెంచూరియన్ సిబ్బంది

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎమిరేటస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చిలుకూరి శాంతమ్మకు చెన్నైకి చెందిన ఇండియన్ స్పెక్ట్రో ఫిజిక్స్ అసోసియేషన్(ఇస్పా) అవార్డును బహూకరించింది. ఈ మేరకు గురువారం విశ్వవిద్యాలయంలో ఇస్పా ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.గుణశేఖరన్, చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఈ అవార్డును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకుంటే వృద్ధిలోకి రాగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రొపెసర్ ఎస్ గుణశేఖర్, ఫిజిక్స్ విభాగాధిపతి విజయ్‌బాబు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ రమణారావు,డీన్ డాక్టర్ సన్నీడయోల్, డాక్టర్ దేవికారాణి పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

ఉన్న ఊరిలోనే విద్యుత్ సేవలు

- ట్రాన్స్‌కో వినియోగదారులకు వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు
- ఉమ్మడి జిల్లాలో 500 మంది నియామకం

రామభద్రపురం: రాష్ట్రప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువ చేసింది. గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతో పాటు పలు విద్యుత్ సేవలు పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్లు, సెక్షన్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాలకు వెళ్లేవారు. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో 14 రకాల విద్యుత్ సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 780 సచివాలయాలు ఉన్నాయి. వివిధ విద్యుత్ సమస్యలపై విద్యుత్ సబ్‌స్టేషన్లు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగకుండా గామ,వార్డు సచివాలయాల ద్వారా సేవలు మరింత అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కష్టాలకు రాం..రాం..

గతంలో పలు రకాల విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు అష్టకష్టాలు పడేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సేవలను గ్రామ సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది.పట్టణ ప్రాంతాల్లో 13 రకాల విద్యుత్ సేవలతో పాటు పల్లెల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు కూడా 14 సేవగా గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేసింది. వినియోగదారులు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్ 2 జేఎల్‌ఎం) కీలకపాత్ర పోషిస్తున్నారు.పట్టణాలు,గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు.ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వం నియమించిన సుమారు 500 మంది ఎనర్జీ అసిస్టెంట్లు వినియోగదారులకు సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వారు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ 5-10 కి.మీ.దూరంలో ఉన్న విద్యుత్ లైన్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలు పరిష్కరించడం, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం తదితర సేవలందిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.


రామభద్రపురం సచివాలయం-2 కార్యాలయం


రామభద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్

గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు శుభపరిణామం



రాష్ట్రప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.గతంలో విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య వచ్చినా కరెంట్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది.ఆ సమస్య లేకుండా గ్రామ సచివాలయాల్లోనే 14 రకాల సేవలు అందుతుండడం శుభపరిణామం.

పూడి సత్యనారాయణ, వినియోగదారు, రామభద్రపురం

సేవలను వినియోగించుకోండి..

గ్రామ సచివాలయాల్లో అందుతున్న 14 రకాల విద్యుత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.గృహ,వ్యవసాయ విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిరాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్లు త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. విద్యుత్ సిబ్బంది ఎవరైన స్పందించకపోతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేస్తే వెంటనే సమస్య పరిష్కారమవుతుంది.

పోల శశిభూషణరావు, విద్యుత్‌శాఖ ఏఈ, రామభద్రపురం

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కేంద్రాస్పత్రి వద్దకు వచ్చి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి పడిపోవడంతో వెంటనే స్థానికులు ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, బంధువులెవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల రహదారిపై గురువారం బైక్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర గ్రామానికి చెందిన పి.గణపతి రావు (56) కిరాణా వ్యాపారి. సరుకులు కొనేందుకు ఉల్లిభద్ర నుంచి పార్వతీపురం పట్టణానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా అడ్డాపుశీల శివాలయం ఆర్చివద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో గణపతిరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.


ప్రమాద దృశ్యం

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్/జామి: హత్యాయత్నం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ 5వ ఏడీజే కోర్టు ఎన్.పద్మావతి గురువారం తీర్పు వెల్లడించినట్లు జామి ఎస్సై జి.వీరబాబు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జామి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జామి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న శంబంగి మంగను భర్త వెంకటరామ్ ప్రసాద్ అనుమానిస్తూ శారీరకంగా వేధిస్తూ ఆమెను హత్యచేయాలనే ఉద్దేశంతో, ఆమె నివసిస్తున్న ఇంటికి నిప్పుపెట్టి కాల్చివేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 2022లో ఎస్సై వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరారోపణలు రుజువు కావడంతో ముద్దాయికి పై విధంగా శిక్ష విధిస్తూ నాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు.

మూగవేదనపై అప్రమత్తం

- చలి, మంచుతో తప్పని ఇబ్బందులు
- ఈ సీజన్‌లో రోగాలు ఎక్కువ
- సకాలంలో టీకాలు వేయించాలి
- పశువైద్యాధికారుల సూచన


శ్రీనివాసరావు, ఎ.డి, పశువైద్యశాఖ

సీతంపేట: మన్యంలో చలికితోడు మంచు విపరీతంగా కురుస్తుంది. ఈ తరుణంలో మూగ జీవాలకు వివిధ రకాల రోగాలు వచ్చే ఆస్కారముంది. ఈ నేపథ్యంలో మూగజీవాలకు తగిన రక్షణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుందని పశువైద్యులు తెలియజేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గొర్రెలు 8,15,213, మేకలు 4,25,609 ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 12,40,822 జీవాలను పెంచుతున్నారు. మూగజీవాలకు సకాలంలో టీకాలు వేయిస్తే మంచిఫలితం ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఎ.డి శ్రీనివాసరావు, దోనుబాయి పశువైద్యాధికారి రాజాం శంకరరావులు తెలిపారు.


టీకాలు వేస్తున్న సిబ్బంది

పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ

1.పీపీఆర్ వ్యాధి : దీన్ని పుర్రురోగం లేదా చీడిపారుడు వ్యాధి అని కూడా అంటారు. జనవరి నుంచి ఆగస్టు మధ్యలో ఈ వ్యాధి వస్తుంది. పారోమక్సో జాతికి చెందిన వైరస్ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు..
- అధిక జ్వరం (106-108 డిగ్రీలు) ఉంటుంది
- పలుచటి నలుపు రంగు విరోచనాలవుతాయి
- నాలుక, పెదవులు, నోటిపై పొక్కులు ఏర్పడతాయి. • దగ్గు, రక్తంతో కూడిన చీమిడి, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది

చికిత్స..
- యాంటీబయాటిక్ ఇంజక్షన్లు 3-5 రోజులు వాడాలి. 1 శాతం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంలో నోటి పుండ్లు శుభ్రపరిచి బోరో గ్లిసరిన్ పేస్ట్ అప్లై చేయాలి. మరోనెక్స్ ఇంజక్షన్లు 3-5 రోజులు వాడాలి. • 3 నెలలు దాటిన గొర్రెలకు వ్యాధి నివారణ టీకా వేయాలి

2. మసూచి
- బొబ్బ, అమ్మతల్లి, అమ్మోరు అని అంటారు. వైరస్ వల్ల కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది.

లక్షణాలు
- జ్వరం 106 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. • తొడ, తోక కింద భాగాల్లో, పెదవులు, కనురెప్పలు, జననేంద్రియాలలో పొక్కులు ఏర్పడతాయి. • నోటినుంచి చొంగ, ముక్కు నుంచి చీమిడి కారుతుంది. • కళ్ల నుంచి నీరు, ముక్కు నుంచి చీము కారుతుంది. శ్వాస కష్టమవుతుంది. • చూడి జీవాలు ఈడుసుకుని పోతాయి.

చికిత్స
- బొబ్బకు హిమాక్స్, వేపనూనె పూయాలి. యాంటీ హిస్టమైన్ ఇంజక్షన్లు 3-5 రోజులు చేయాలి.

3. గాలికుంటువ్యాధి
- నోటిగాళ్లు, కాళ్లగాళ్లు అని అంటారు.

లక్షణాలు..
- జ్వరం • చొంగ • నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు • మేత మేయకపోవడం, కుంటుట ఉంటాయి

చికిత్స..
- యాంటీ బయాటిక్స్ 3-5 రోజులు వాడాలి. 1 శాతం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంతో పుండ్లను శుభ్రం చేసి నోటిపుండ్లకు బోరోగ్లిజరిన్, కాలిపుండ్లకు జింక్ ఆయింట్‌మెంట్ పూయాలి.

4. మూతిపుండ్ల వ్యాధి (కంటేజియస్ ఎగ్జిమా)..
- వైరస్ ద్వారా చలికాలంలో ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు
- ముక్కు రంధ్రాల చుట్టూ ఎర్రగా పొక్కులు ఏర్పడతాయి.
- పెదవులు కలిసే చోట ఎర్రగా మారి, నల్లటి పొక్కులు ఏర్పడతాయి

చికిత్స
- యాంటీబయాటిక్ 3-5 రోజులు వాడాలి. 2 శాతం బోరోగ్లిజరిన్ నోటికి పూయాలి

5. కంటేజియస్ కేప్లయిన్ ప్లూరో న్యుమోనియా..
- మైకోప్లాస్మా ద్వారా చలికాలంలో మేకల్లో ఈ వ్యాధి సోకుతుంది.

లక్షణాలు
- జ్వరం, నొప్పితో కూడిన పొడిదగ్గు, శ్వాస కష్టమవడం, చొంగ, ముక్కునుంచి స్రావాలు కారుతాయి

చికిత్స..
- యాంటీ బయాటిక్స్, యాంటీ హిస్టమైన్ ఇంజక్షన్ చేయాలి.

వచ్చే నెల 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు

- డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు

నెల్లిమర్ల: వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో డిసెంబరు 11,12 తేదీల్లో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. మొత్తం 10 కళారూపాలలో ద్విమితీయ, త్రిమితీయ చిత్రణ, సంప్రదాయ బద్ధ ఆటబొమ్మలు, ఆటలు, నాటకం (ఏక పాత్రాభినయం) విభాగాల్లో పోటీలు 11వ తేదీన నిర్వహిస్తామని చెప్పారు. గాత్ర సంగీతం(సంప్రదాయ, జానపద), వాద్య సంగీతం(పర్కెసివ్-మెలోడిక్), నాట్యం(సంప్రదాయ-జానపద) విభాగాల పోటీలు 12వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి ఒక్కో కళారూపంలో ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే (విడివిడిగా) పాల్గొనాలని స్పష్టం చేశారు. గత సంవత్సరం (2022) జరిగిన కళాఉత్సవ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులు ఈ సంవత్సరం పాల్గొనేందుకు అనర్హులని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు వారికి అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి కళారూపానికి 5 నిమిషాల సమయం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డైట్ కళాశాల బోధనా సిబ్బంది పి.రవికుమార్ ఫోన్ 7989350244 నంబర్, కె.సూర్యారావు ఫోన్ 9441684360 నంబర్లను వాట్సాప్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

అండర్-19 మహిళల క్రికెట్ జట్టు కొండపల్లి పయనం


అండర్-19 బాలికల క్రికెట్ పోటీలకు వెళ్తున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాలికల స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా మహిళల జట్టు గురువారం పయనమైంది. డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు విజయవాడలోని కొండపల్లిలో జరగనున్న పోటీల్లో 13 మంది క్రీడాకారిణుల టీమ్ జిల్లా తరపున పాల్గొననుంది. అంతర్ జిల్లాల పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారిణులను అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పీడీలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 51 మందికి ఉపకరణాల పంపిణీ


బ్యాటరీ ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: దివ్యాంగులు కూడా సమాజంలో అందరితో బాటు సమానంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం వారి కోసం ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలిమ్‌కో సంస్థ ద్వారా మండలంలోని 51 మంది దివ్యాంగులకు కేటాయించిన ఉపకరణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల కోసమే ప్రభుత్వం ఆలిమ్‌కో సంస్థతో చర్చించి కోట్లాది రూపాయల విలువైన ఉపకరణాలను తెప్పించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, అధికార్ల శ్రీనుబాబు, చందక గురునాయుడు, రఘుమండ త్రినాథ్, దాలయ్య, ముజీకీర్ మహ్మద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా కంప్లీషన్ డ్రైవ్

- ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్


మాట్లాడుతున్న హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్

విజయనగరం అర్బన్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి డిసెంబర్ 1 నుంచి మెగా కంప్లీషన్ డ్రైవ్ నిర్వహించాలని హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్ తెలిపారు. రాష్ట్రంలో ఈ అక్టోబర్‌లో 5.8 లక్షల గృహాలు పూర్తయి గృహ ప్రవేశాలు జరిగాయని, వచ్చే జనవరి లోపల మరో 5 లక్షల గృహాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో మెగా కంప్లీషన్ డ్రైవ్ పై మండల ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, మండలాభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మితో కలసి మండల వారీగా లక్ష్యాలపై సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసి వచ్చే ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశానికి సిద్ధం కావాలని కోరారు. వచ్చే 2 రోజుల్లో మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, డిసెంబర్ 10 లోపల సచివాలయ స్థాయిలో సమావేశం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస రావు, హౌసింగ్ ఈఈలు, డీఈలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

వింత మేక పిల్ల జననం, మృతి

గంట్యాడ: వింత పోలికలతో జన్మించిన ఓ మేక పిల్ల కొద్దిసేపటికే మృతి చెందింది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాళ్లపూడి రామకృష్ణకు మేక గురువారం మధ్యాహ్నం వింత మేక పిల్లకు జన్మినిచ్చింది. మనిషి తల పోలిన విధంగా పెద్ద మొదడుతో మేకపిల్ల జన్మించింది. దీంతో కాలనీ వాసులు మేక పిల్లను చూడడానికి వచ్చారు. అయితే పుట్టిన కొద్దిసేపటకే పిల్ల మృతి చెందింది. జన్యుపరమైన లోపాల కారణంగానే ఈవిధంగా మేక పిల్లలు జన్మనిస్తాయని పశు సంవర్థకశాఖ ఎ.డి డాక్టర్ రెడ్డి కృష్ణ తెలిపారు.

WANTED

Society for Social Transformation, NGO Wanted Counsellors/ Trainers for its CFL Project of DEAF-RBI & SBI at Saluru, Nelimarla, S.Kota, Pasupatirega, BobbiliMandal HQs of Parvathipuramand Vizianagaram Districts. Locals and nearby Mandal Candidates only need to apply.

Salary is Rs.17,000 pm including travel.

Degree with Computer Knowledge and Training experience required. Selected Trainer needs to mobilise women/youth/farmers etc. & Conduct Trainings and liaison with Banks & Government offices.

Send your CV to sstcfldcvizianagaram@gmail.com by 8th December 2023. Shortlisted candidates will be called for interview. Don't believe mediators.

V.Anjaneyulu, Project Director, SST NGO
Contact District Coordinator: 81255 37415

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ వాసవి లే అవుట్ విజయనగరం నందు 220 Sq.yds అప్రూవ్డ్ లేఅవుట్ సైట్ డైరెక్ట్ రిజిస్ట్రేషన్ కేవలం 22 లక్షలు మాత్రమే. సంప్ర : 92466 24248 [V-797069]

LAND FOR SALE
■ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో హైవే రోడ్‌కి సమీపంలో 2200 చ॥గ॥ స్థలంలో నిర్మాణాలో కరెంట్, వాటర్ కల్గియున్నది. అమ్మబడును. సంప్ర: 9849498331 [T-777446]

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

WANTED
■ వైజాగ్‌లో గల ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు గల యువకులు కావలెను. జీతం : 13500/- + ఫుడ్, రూమ్, ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు. ఫోన్ : 97046 37370, 99499 04532 [V-26457]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221881]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221927]

■ హైదరాబాద్‌లోని అప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45వయసు గల M/F Care Takers కావలెను. జీతం: 18-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. 9381848549 [G-1608]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9640258899/ 9640468899 [H-793657]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.